www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 26 జూన్ 2025

కొనసాగుతున్న ఏనుగుల దాడులు

ప్రజాశక్తి- రొంపిచర్ల: పులిచెర్ల మండలంలో బుధవారం పాళ్లెం పంచాయతీ కోటపల్లి రైతులు వెంకటరమణ, వీరభద్ర, దామోదర్‌కు చెందిన అరటి చెట్లు, మామిడి చెట్లను ఏనుగుల గుంపు దాడి చేసి ధ్వంసం చేశాయి. అలాగే దేవళంపేట పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లి గ్రామానికి చెందిన రైతు రవి మామిడి చెట్లను ధ్వంసం చేసి కాయలను నేలరాల్చాయి. ఏనుగులు గుంపులుగా చేరి పంటలను తొక్కుకుంటూ మళ్లీ అడవుల్లోకి వెళ్లిపోయాయి. అటవీశాఖ అధికారులు గ్రామాలకు చేరుకుని రైతుల పంటను పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేశారు.

ఈ కేవైసీ చేయకుంటే రేషన్ కట్..!

- 30 వరకూ గడువు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ప్రజాపంపిణీ వ్యవస్థలో పారదర్శకత పేరిట ప్రభుత్వం రేషన్‌కార్డులోని లబ్ధిదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని నిబంధన తీసుకొచ్చింది. ఏప్రిల్ నెలలో పెద్దఎత్తున ఆయా రేషన్ షాపుల వద్ద సచివాలయ సిబ్బంది ద్వారా రేషన్‌కార్డు లబ్ధిదారుల వేలిముద్రలు సేకరించి ఈకేవైసీ పూర్తి చేశారు. వేలిముద్రలు అరిగిపోవడంతో వృద్ధులు, చిన్న పిల్లల వేలిముద్రలు (ఫింగర్‌ఫింట్) నమోదు కాక ఇలా జిల్లాలోని కొందరి ఈకేవైసి పూర్తి కాలేదు. ఈనెల చివరి నాటికి అంటే ఈనెల 30వ తేదీ లోపు ఈకేవైసి పూర్తి లబ్ధిదారులను రేషన్‌కార్డు లబ్ధిదారుల నుండీ ప్రభుత్వం తొలగించనున్నట్లు సమాచారం.

ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తున్న రేషన్, నిత్యావసర సరుకులు పొందుతున్న లబ్ధిదారులు తప్పనిసరిగా ఈకేవైసి చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఈకేవైసి చేసుకొని వారు గ్రామ,వార్డు సచివాలయల్లో ఈనెల 30వ తేది లోపు ఈకేవైసి చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులు సూచిస్తున్నారు. చౌకదుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న సబ్సిడీ నిత్యావసరాల్లో అవినీతి చోటు చేసుకుంటోందని నకిలీ రేషన్‌కార్డులు ఏరితే, చనిపోయినా, ఇతర రాష్ట్రాలకు వెళ్ళిపోయిన వారిని తగ్గించేలా ప్రభుత్వం ప్రతి లబ్ధిదాద్నుకీ ఈకేవైసి తప్పనిసరి చేసింది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 11,74,438 తెల్ల రేషన్‌కార్డులున్నాయి. వీరందరికీ 2,901 చౌకదుకాణాల ద్వారా రేషన్ నిత్యావసరాలు సరఫరా అవుతోంది. గత ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ సరఫరా పేరిట తీసుకొచ్చిన ఎండియూ మొబైల్ నిత్యావసర సరుకులు పంపిణీ వాహనాలను గత నెల అంటే మే నెల నుండీ రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ప్రస్తుతం జిల్లాలోని చౌకదుకాణం డీలర్ల వద్దకు వెళ్ళి రేషన్ తీసుకోవాలి. నడవలేని వృద్ధులు, ఆరోగ్య సమస్యలతో రేషన్‌షాపు వద్దకు రాని వారికి చౌకదుకాణం డీలర్ ఇంటి వద్దకు వెళ్లి బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు సేకరించి నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం. ఈ మేరకు కొందరు లబ్ధిదారుల ఇండ్ల వద్దకు వెళ్ళకపోవడంతో వృద్ధులు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న సబ్సిడీ బియ్యం పొందలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెలా ఉదయం 6 నుంచి 12 గంట వరకు సాయంత్రం 4 నుంచి నుంచి రాత్రి 8 గంటల వరకు చౌకదుణాల్లో రేషన్ సరఫరా చేయాల్సి ఉంటుంది. సర్వర్ పని చేయడం లేని ఇతర కారణాలు, డీలర్లు అందుబాటులో ఉండకపోవడంతో లబ్ధిదారులు చౌక దుకాణాల చుట్టూ తిరగాల్సి వస్తోందంటున్నారు. నిత్యావసరాలు ఇంటి వద్దకే అందించే మొబైల్ వాహనాలు రద్దు చేయడంతో చౌకదుకాణం నుంచి బియ్యం ఇంటి వద్దకు తీసుకుపోవడం ఇబ్బందిగా మారుతోందంటున్నారు. కొందరైతే ఇద్దరు, ముగ్గురు కలసి ఆటోకు వంద రూపాయల్చి బియ్యం తీసుకుపోవాల్సి వస్తోందంటున్నారు.

ఇక ఈకేవైసి విషయానికొస్తే ఈ ప్రక్రియ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా చేసుకొవచ్చు. ఆఫ్‌లైన్ కోసం సమీపంలోని రేషన్‌షాపు లేదా కామన్ సర్వీస్ సెంటర్‌కు వెళ్ళాలి. అక్కడ మీరు మీ రేషన్‌కార్డు, కుటుంబ సభ్యులందరి ఆధార్ కార్డులను మీతో తీసుకెళ్ళాలి. బయోమెట్రిక్ వెరిఫికేషన్ పిఓఎస్ మిషన్ ద్వారా జరుగుతుంది. దీని తరువాత మీ రేషన్‌కార్డు ఆధార్‌తో లింక్ అవుతుంది. ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా అయితే ఆధార్ ఫేస్ ఆర్‌డి వంటి యాప్‌లను ఉపయోగించుకోవచ్చు. గూగుల్ ప్లేస్టోర్ నుండీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని మీ ఆధార్ నెంబర్‌ను నమోదు చేయడం ఓటిపి ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయండి. ఆపై ముఖ స్కానింగ్ చేసి ఈకేవైసి పూర్తి చేయవచ్చు.

తగ్గిపోనున్న లబ్ధిదారులు

జూన్ 30 నాటికి లబ్ధిదారులు ఈకేవైసీ పూర్తి చేయకుంటే ఈకేవైసీ చేసుకొని వారి పేర్లను రేషన్‌కార్డు లబ్ధిదారుల నుండీ తొలగించనున్నారు. ఉదాహరణకు ఐదుగురు ఉన్న తెల్లకార్డులో ముగ్గురు ఈకేవైసి చేసుకొని ఇద్దరు చేసుకోకుంటే ఆ ఇద్దరిన్ని తొలగిస్తారు. జూలై నెల నుండీ ముగ్గురికి మాత్రమే రేషన్ అందుతుంది. ఇలా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 55 వేల మంది ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు, వేలి ముద్రలు, ఐరిష్ మ్యాచ్ కానివారున్నట్లు సమాచారం. ఇలా ఈకేవైసి పూర్తి కాని వారు రేషన్‌కార్డు నుండీ పేర్లు తొలగించబడి ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా మారే అవకాశముంది. లబ్ధిదారుల దిపుంకు ఈకేవైసి తీసుకొచ్చిన ప్రభుత్వం రేషన్ కార్డుల ఏరివేతకు రంగసిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 11,74,438 తెల్లరేషన్ కార్డుదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులా..? ఇందులో అనర్హులెంత మంది అనే విషయాన్ని రెవెన్యూ, సచివాలయ సిబ్బంది ద్వారా సర్వే చేపట్టనుంది.

ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట స్ఫూర్తితో...

మోడీ మతోన్మాద పాలన తిప్పికొడదాం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: కేంద్రంలోని మోడీ పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని సిపిఎం కేంద్రకమిటి సభ్యురాలు డి.రమాదేవి ఉద్ఘాటించారు. నేడు మతోన్మాద బిజెపి దుష్ట పాలనను తిప్పికొట్టడమే 50 యేళ్ల ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటం మనకిచ్చే స్ఫూర్తి అని వక్తలు పేర్కొన్నారు.. సరిగ్గా జూన్ 25 నాటికి యాభై సంవత్సరాల క్రితం దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించిన నేపథ్యంలో 'నాడు ప్రకటిత ఎమర్జెన్సీ..నేడు అప్రకటిత ఎమర్జెన్సీ' సదస్సు బుధవారం వేమన విజ్ఞాన కేంద్రంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డి.రమాదేవి, ఎమర్జెన్సీ సమయంలో తిరుపతి జిల్లాలో అరెస్టయిన ప్రముఖ రచయిత శైలకుమార్, సీనియర్ పాత్రికేయులు రాఘవ మాట్లాడుతూ నాటి ఎమర్జెన్సీ రోజున అర్ధరాత్రి దేశంలో ప్రతిపక్ష పార్టీల నాయకులను, కార్యకర్తలను లక్షా 13వేల మందిని ప్రభుత్వం అరెస్టు చేసిందని, ఇందులో కార్మిక యూనియన్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి నాయకులే ఎక్కువగా ఉన్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లోని హెచ్ఎంటి, ఇసిఐఎల్, ఐడిపిఎల్, పబ్లిక్ సెక్టార్లలోని నాయకులు అనేకమంది అరెస్టయ్యారన్నారు. వాస్తవానికి నాడు కార్మికులు, విద్యార్థులు, వామపక్షవాదులే ప్రధాన ప్రతిఘటన దారులన్నారు. యాభైఏళ్ల అనంతరం ఎమర్జెన్సీ చీకటిపాలన గుర్తు చేసుకుంటే, అంతకంటే మరింత ప్రమాదకరమైన పరిస్థితి నేడు కార్పొరేట్ మతోన్మాద పాలనలో నిర్బంధాన్ని ప్రజలు అనుభవిస్తున్నారన్నారు. ప్రొఫెసర్ సాయిబాబాను యుఎపిఎ చట్టం కింద ఎలాంటి విచారణ లేకుండా పదేళ్ళ జైలు నిర్బంధాన్ని ఎదుర్కొన్నారన్నారు. బ్రిటీష్ పాలనలో రాజద్రోహ నేరం కింద మూడేళ్ల కంటే ఎక్కువ కాలం విచారణ లేకుండా నిర్బంధించడానికి వీల్లేదని, నేడు బిజెపి పాలనలో పదేళ్లు విచారణ లేకుండా నిర్బంధించే పరిస్థితి దాపురించిందన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకాశ్మీర్, లడక్‌లలో ప్రజాస్వామ్యం మృగ్యమయ్యిందన్నారు. 1926 బ్రిటీషు కాలంలో పోరాడి సాధించుకున్న సమ్మె హక్కు చట్టాన్ని లేబర్ కోడ్‌ల పేరుతో అత్యంత నిరంకుశంగా రద్దు చేసిందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, టి. సుబ్రమణ్యం, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సాయిలక్ష్మి, ఆర్. లక్ష్మి, కె. వేణుగోపాల్, ఎన్. మాధవ్, చిన్న, బుజ్జి, జి.బాలసుబ్రహ్మణ్యం, రాజు, రమేష్, నరేంద్ర, జయంతి, టి. దామోదరం, ఓ. వెంకటరమణ, జన విజ్ఞాన వేదిక నాయకులు రెడ్డెప్ప పాల్గొన్నారు.

15 వేలు మంది నుంచి మామిడి కొనుగోలు

కలెక్టర్‌తో కలిసి జైన్ ఫ్యాక్టరీని సందర్శించిన రాష్ట్ర హార్టికల్చర్ డైరెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: జిల్లాలో ఇప్పటివరకు 15 వేలు మంది రైతులు నుండి తోతాపురి మామిడి కాయలు కొనుగోలు చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గంగాధర నెల్లూరు మండలం గొల్లపల్లి జైన్ ఫ్యాక్టరీ బుధవారం రాష్ట్ర హార్టికల్చర్ డైరెక్టర్ శ్రీనివాసులు సందర్శించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీలో రైతులతో అదేవిధంగా ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ దిలీప్ కుమార్ మామిడి కాయల విషయంగా చర్చించి వివరాలకు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది మామిడి కాయలు దిగుబడి అనుకోని విధంగా రావడంతో ఫ్యాక్టరీ యజమానులు కొనుగోలు విషయంగా కొంత ఆలస్యం జరుగుతుందన్నారు. రైతులు 95 వేల మెట్రిక్ టన్నుల మామిడి కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని రెండు జైన్ ఫ్యాక్టరీలలో ప్రతిరోజు 200 ట్రాక్టర్ల మామిడికాయలు తీసుకోవడం జరుగుతున్నాయని చెప్పారు. రైతులు ఎవరు కూడా ఆందోళన పడాల్సిన అవసరం లేదని ప్రతి రైతు నుంచి మామిడి కాయలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్డిఏ పీడీ శ్రీదేవి, తహశీల్దార్ శ్రీనివాసన్, సీఐ శ్రీనివాసంతి, జైన్ ఫ్యాక్టరీ మేనేజర్ దిలీప్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో యథేచ్ఛగా గంజాయి

- కుప్పం నియోజకవర్గంలో గంజాయి సాగు

గంజాయి చెట్లను నరుకుతున్న రైతు నాగరాజు

ప్రజాశక్తి- గుడిపల్లి: కుప్పం నియోజకవర్గం గుడిపల్లె మండలం చిన్నగుడిపల్లె పంచాయతీలో నాగరాజు అనే వ్యక్తి యథేచ్ఛగా పొలంలోనే గంజాయి సాగు చేస్తున్న ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కుప్పం నియోజకవర్గంలో గుడిపల్లి మండలం చిన్న గుడిపల్లి పంచాయతీ ఎం.కొత్తూరు గ్రామంలో పి.నాగరాజు (60) అనే వ్యక్తి తన పొలంలో గత ఆరు నెలలుగా గంజాయి పండిస్తున్నట్లుగా స్థానికులు గుర్తించారు. ఎవరికీ తెలియకుండా గుట్టుచప్పుడు కాకుండా గంజాయి పండిస్తూ విక్రయాలు చేస్తున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు తహసీల్దారు సీతారామ్, కుప్పం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జె.మల్లేష్ యాదవ్, గుడిపల్లి ఎస్ఐ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి మంగళవారం మెరుపుదాడులు నిర్వహించారు. ముద్దాయి గత ఆరు నెలలుగా గంజాయి పండించి, వాటిని ఎండబెట్టి చుట్టుపక్కల గ్రామాలకు విక్రయిస్తున్నట్టు తెలిసిందన్నారు. ముద్దాయి పొలంలో మొత్తం 4 గంజాయి మొక్కలు గుర్తించి కాల్చివేయడం జరిగిందని తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మార్కెట్ విలువ సుమారు రూ.1,00,000లు ఉంటుందని తెలిపారు. అనంతరం నిందితుడు పి.నాగరాజును అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. ఈ సందర్భంగా ఎవరైనా నిషేధిత గంజాయి సాగు చేసినట్లయితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంజాయి విక్రేత అరెస్ట్ - రెండు కేజీల గంజాయి స్వాధీనం

విజయపురం (నగరి): నగరి పట్టణ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న తమిళనాడు, కాంచీపురంకు చెందిన ఓ.ప్రేమ్‌కుమార్ (26) అనే వ్యక్తి పోలీసులు బుధవారం ఉదయం అరెస్టు చేశారు. సీఐ విక్రమ్ తెలిపిన మేరకు.. గంజాయి విక్రయాలపై ఎస్పీ, డీఎస్పీల ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా ఉంచారని ఇందులో భాగంగా బుధవారం ఉదయం మండలంలోని వీకేఆర్ పురం వద్ద గంజాయి విక్రయాలు జరుగుతున్నాయంటూ పక్కాగా అందిన సమాచారం మేరకు డిప్యూటీ తహశీల్దార్ మేఘవర్ణం, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నట్లు తెలిపారు. వీకేఆర్ పురం వద్ద నగరి- తిరుత్తణి మెయిన్ రోడ్డుకు ఆనుకొని మోటార్ సైకిల్‌పై గంజాయి అమ్ముతున్న ప్రేమ కుమార్ అలియాస్ ప్రేమ్ అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద ఉంచుకున్న 2 కేజీల గంజాయితో పాటు ద్విచక్రవాహనం, మొబైల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ గంజాయి విలువ రూ.32 వేలుగా అంచనా వేశారు. ప్రేమ్‌కుమార్ తిరుత్తణిలోని ఒక సప్లైయర్ వద్ద నుంచి గంజాయిని తీసుకువచ్చి నగరి పరిసర ప్రాంతాలలో విక్రయిస్తున్నట్లు, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని పేర్కొన్నారు. ప్రధాన సరఫరాదారులను కూడా త్వరలో పట్టుకుంటామని సీఐ తెలిపారు. అనంతరం ముద్దాయిని రిమాండ్‌కు తరలించారు. గంజాయి విక్రేతను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన సిబ్బంది గజేంద్ర, లోకనాథం, రమేష్, సత్య, అశోక్, గణేష్ లను అభినందించారు.

ముద్దాయిని, స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న సిఐ

మోకాలిపై నిలబడి ఔట్ సోర్సింగ్ సిబ్బంది నిరసన

- మూడో రోజుకు చేరిన కార్మికుల సమ్మె

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో పనిచేసే ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికుల జీతాలు పెంచాలని కోరుతూ చేపట్టిన సమ్మె బుధవారం మూడవ రోజుకు చేరింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శరవణ మాట్లాడుతూ గత ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులకు, డ్రైవర్లకు జీతాలు పెంచిన విధంగానే ఇంజినీరింగ్ విభాగంలో రకరకాల పనులు చేసే కార్మికులకు కూడా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అవుట్ సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె గురించి మున్సిపల్ శాఖమంత్రి నారాయణకు విన్నవించినప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పట్టించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్మికులతో ఈనెల 26వ తేదీన సీడీఎంఏ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.శివకుమార్, కోశాధికారి కే.ఆర్.శివప్రసాద్, గౌరవ సలహాదారు పి.వెంకటేష్, ఉపాధ్యక్షులు ఎం.హరికృష్ణ, ఎన్.వెంకటేష్, జాయింట్ సెక్రెటరీ టి.గోపాలాచారి, ఏ.ఉష, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

చిత్తూరులో..

నగరిలో..

విజయపురం (నగరి): నగరి మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం మున్సిపల్ ఇంజనీరింగ్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది మోకాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో జీవితాలు నెట్టుకొస్తున్నామని, కనీసం ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అందక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 'మా మొర ఆలకించండి మా సమస్యలు పరిష్కరించండి' అంటూ వాపోయారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట బైటాయించి నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన మేరకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ నిఘా

- సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి :ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పోలీసింగ్ స్కిల్స్, విజిబుల్ పోలీసింగ్ పెంచే విధంగా పని చేయాలని, ప్రజలతో సామరస్యంగా, సఖ్యతతో చట్టంపై గౌరవం పెంపొందేటట్లు మెలగాలని, అక్రమ రవాణ నేరస్తులపై ఉక్కు పాదం మోపడమే కాకుండా పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరితగతిన పరిష్కరించాలని నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు జిల్లాలో పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన నేరసమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాల అణచివేతకు డ్రోన్‌ల సహాయంతో నిఘా పెంచాలన్నారు. ఇప్పటికే సిబ్బందికి డ్రోన్ శిక్షణ ఇవ్వడం జరిగిందని, ఆధునిక సాంకేతికతను ఉపయోగించి నేర పరిశోధన, శాంతి భద్రతల పరిరక్షణ, భారీ సమావేశాల్లో భద్రతాచర్యలు తీసుకోవడం వంటి విభిన్నదశల్లో డ్రోన్లు ఉపయోగపడుతాయన్నారు. ముఖ్యంగా పెద్ద ఎత్తున జరిగే సభలు, ర్యాలీలు, ట్రాఫిక్ కంట్రోల్, అటవీ ప్రాంతాల పర్యవేక్షణ, కల్తీ మద్య తయారీ స్థలాల గుర్తింపు వంటి విభాగాల్లో డ్రోన్‌లు సహాయపడతాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ అండ్ నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, డెకాయిటీ, రాబరీ, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, మిస్సింగ్, చీటింగ్, తదితర కేసులు, సైబర్ నేరాలు, ఇతర కేసులను సమీక్షించారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి కేసుల ఫైల్స్, రికార్డ్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల ఛేదింపునకు, పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు, మెళకువలను అధికారులకు దిశానిర్దేశాలు చేశారు. కేసు నమోదు అయిన తర్వాత కోర్టులో నిందితులకు జైలు శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకున్నప్పుడే బాధితులకు సరైన న్యాయం చేసినట్లు అవుతుందని సూచించారు. ఏదైనా దొంగతనం జరిగిన వెంటనే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని, నేరస్తుడు వదిలిన సాక్ష్యాధారాలు, సిసి కెమెరాల ఫుటేజీలను క్రోడీకరించి ముద్దాయిలను పట్టుకొని, వారి వద్ద నుండి పూర్తిమొత్తంలో దొంగిలించబడిన సొమ్ము రికవరీ చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ ఇంచార్జ్ అడ్మిన్ రాజశేఖర్ రాజు, జిల్లాలోని సబ్ డివిజన్ డీఎస్పీలు, సర్కిల్ ఇన్స్పెక్టర్‌లు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేర సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

ఈవీఎం గోడౌన్‌కు పటిష్టమైన నిఘా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద 24/7 ప్రకారం నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాలు మేరకు త్రైమాసిక తనిఖీలో భాగంగా చిత్తూరు కలెక్టరేట్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్ ను బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల సమక్షంలో గోదాము లోపల భద్రపరిచిన ఆయా ఈవీఎం యంత్రాలు బియులు, సియూలు, వివి ప్యాట్‌లను, అక్కడి భద్రతా చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వివిధ అంశాలలో రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, భద్రతను కాపాడాలనే ఉద్దేశంతోనే ఈ పర్యటన చేపట్టినట్లు ఆయన స్పష్టం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, రాజకీయ పార్టీ ప్రతినిధులు సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు, టిడిపి సురేంద్ర కుమార్, బిజెపి అట్లూరి శ్రీనివాసులు, వైస్సార్ ఉదయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పరదేశి, జనసేన యశ్వంత్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రాజేంద్ర పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ వినతులపై ప్రత్యేక దృష్టి సారించండి : డిఆర్ఓ

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: పిజిఆర్ఎస్‌లో వచ్చిన వినతలపై ప్రత్యేక దృష్టి సారించండి డిఆర్ఓ మోహన్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో ఆయన ఛాంబర్ నుండి టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో పిజిఆర్ఎస్ అమలపై సంబంధిత జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎమ్మార్వోలు, సర్వేర్లకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అనేక సమస్యలు స్వీకరించుచున్నామని సాధ్యమైన వాటిని పరిష్కరించాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలలో పెండింగ్లో ఉన్న అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి అర్జీని నిర్ణీత గడువు లోపల అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. ప్రతి అర్జీని ఆమూలాగ్రం పరిశీలించి నాణ్యతతో వారి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం అధికారులపై ఉందన్నారు. సమస్యల పరిష్కారంపై అర్జీదారుల నుండి నేరుగా ప్రభుత్వం ఫీడ్బ్యాక్‌ను సేకరిస్తోందని ఈ అంశాన్ని ప్రతి ఒక్కరు గమనించి చిత్తశుద్ధితో అర్జీలను పరిష్కరించాలన్నారు.

టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిఆర్ఓ మోహన్ కుమార్

నవోదయానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 5వ తరగతి చదువుచున్న విద్యార్థుల కోసం మదనపల్లి మండలం వలసపల్లిలోని పియం.స్కూల్ జవహర్ నవోదయ విద్యాలయలో 2026-27 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశం కొరకు ఎంపిక పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బుధవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనుటకు జులై 29 చివరి తేది అని, ప్రవేశ పరీక్ష డిసెంబర్ 13న నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే స్వీకరించబడునని, అభ్యర్థులు ఆన్‌లైన్ నమోదు దర్శించగలరని, ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న దరఖాస్తులను మాత్రమే నవోదయ విద్యాలయ సమితి వారు అనుమతిస్తారని పేర్కొన్నారు. ఇతర మార్గాలు, పద్ధతుల ద్వారా పంపిన దరఖాస్తులు స్వీకరించబడవని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసే సమయంలో సందేహ నివృత్తికై హెల్ప్‌డెస్క్ నెంబర్లను 89199 56395, 94409 45913, 807463 05048 సంప్రదించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఎమ్మెల్యేను సన్మానించిన తహశీల్దార్

ప్రజాశక్తి- పలమనేరు: నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండల నూతన తహశీల్దారుగా బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన హనుమంతు నాయక్ ఎమ్మెల్యే అమర్నాథరెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి దుశాలవలతో ఘనంగా సత్కరించారు. ఈయన గతంలో పుంగనూరు నియోజకవర్గంలోని చౌడేపల్లి మండలం తహశీల్దార్ విధులు నిర్వర్తించారు. సాధారణ బదిలీల్లో భాగంగా పెద్దపంజాణి మండలానికి బదిలీపై వచ్చారు. గతంలో పెద్దపంజాణి మండలంలో పనిచేసిన అనుభవం ఈయనకు ఉన్నందున మండంలోని రెవెన్యూ సమస్యలను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

పంచాయతీ సెక్రటరీగా శిరీష

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామ పంచాయతీ సెక్రటరీగా శిరీష బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈమె యాదమూరి మండలంలో విధులు నిర్వహించారు సాధారణ బదిలీల్ల భాగంగా యాదమరి నుంచి గంగాధర నెల్లూరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మురళి బదిలీపై పెనుమూరు మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా సర్పంచ్, పలువురు నేతలు నూతన పంచాయతీ సెక్రటరీ శిరీషకు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. సర్పంచ్ శ్రీ బాబు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కర్ణ, నాయకులు నియాజ్ అలీ, శాంత్ కుమార్, జీవరత్నం, నీరజాక్షులరెడ్డి, శంకర్, సంపత్, పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా సీకే శ్రీనివాసులు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండల తహశీల్దారుగా సీ.కే. శ్రీనివాసులు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన చంద్రశేఖర్ పదవీవిరమణ పొందగా, డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న తులసీరామ్ ఇన్‌చార్జి తహశీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్తూరు ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్న సి.కే శ్రీనివాసులను జీడి నెల్లూరు తహశీల్దారుగా ఉన్నతాధికారులు నియమించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం పట్టణ టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడ కమిటీ సభ్యులు పిఎస్ మునిరత్నం, డాక్టర్ సురేష్ బాబులు విచ్చేసి ఏడు మంది లబ్ధిదారులకు సహాయ నిధి చెక్కులను అందజేశారు. వారు మాట్లాడుతూ పట్టణానికి చెందిన ఏడు మందికి వైద్యం కోసం అయినా ఖర్చు సిఎం సహాయ నిధి ద్వారా రూ.12 లక్షలు చెక్కుల రూపంలో బాధితులకు అందించినట్లు తెలిపారు. నాయకులు సత్యేంద్ర శేఖర్, కాణిపాకం వెంకటేష్, ముత్తు, తిరుమగల్ పాల్గొన్నారు.

చెక్కులను లబ్ధిదారులకు అందిస్తున్న నాయకులు

రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలి

అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర

జెసిబితో రోడ్డు ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : నగరంలో హైరోడ్డు విస్తరణలో భాగంగా శనివారం కట్టమంచిలో రోడ్డు ఆక్రమణలను తొలగించారు. నగరంలోని ప్రధానమైన హైరోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. బుధవారం ఏసీపీ నాగేంద్ర ఆదేశాల మేరకు ప్రణాళిక విభాగం అధికారులు కట్టమంచి ప్రాంతంలో భవన ప్లాన్ అప్రూవల్ పొందేటప్పుడు చితూరు నగరపాలక సంస్థకు రాసిచ్చిన స్థలంను, రోడ్డును ఆక్రమించుకున్న వాటిని అనాధికార బోర్డులను జెసిబి సహాయంతో తొలగించడం జరిగింది. టీబీపీవోలు, ప్రణాళిక సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతే లక్ష్యంగా పనులు

చెత్తను శుభ్రం చేయిస్తున్న కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: పరిశుభ్రత లక్ష్యంగా ముమ్మరంగా పారిశుధ్యపనులు సాగుతున్నాయని మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ కార్యదర్శి వెంకటేశులు తెలిపారు. బుధవారం ఆ పంచాయతీ వీధులను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందితో చెత్తను శుభ్రం చేయించి ట్రాక్టర్ ద్వారా డంప్ యార్డుకు తరలించారు. ప్రధానం వాణిజ్య కూడలిలో పరిశుభ్రతను పక్కాగా పాటించాలని, ప్రజలను, వ్యాపారులు పంచాయతీ వర్కర్లకు సహకరించాలని కోరారు.

లోకయ్యకు పైనేని మురళి సాయం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: అనారోగ్యంతో చిత్తూరు ప్రభుత్వఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు లోకయ్యను తెలుగుదేశం యువ నాయకుడు పైనే మురళి బుధవారం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లతో మాట్లాడారు. ఆయన త్వరగా కోలుకొని ఆరోగ్యంగా స్వగృహానికి చేరుకోవాలని కోరినట్లు తెలిపారు.

విద్యార్థులకు విద్యాకిట్ల పంపిణీ

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం పట్టణం కొత్తపేటలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యా కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు కృష్ణప్ప, పాఠశాల కమిటీ అధ్యక్షురాలు రోజా మదన్ ఆధ్వర్యంలో జరిగింది. విద్యార్థులకు విద్యా కిట్లు అందించిన అనంతరం వారు మాట్లాడుతూ విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం విద్యాశాఖ మంత్రి వినూత్న పతకాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ అధ్యక్షులు కన్నన్, నాయకులు ముఖేష్ (అప్పు), అన్సర్ బాష, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

శివుని సన్నిధిలో గూగుల్ వైస్‌ప్రెసిడెంట్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయానికీ ఏఐ సాంకేతికతను అందివ్వాలని గూగుల్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ తోట చందును శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కోరారు. స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి చందు బుధవారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. రాహు-కేతు పూజలు, స్వామీ అమ్మవార్ల దర్శనానంతరం చందుతో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ప్రత్యేకంగా కలిశారు. తిరుమలలో భక్తులు ఇబ్బంది పడకుండా టీటీడీ ఏఐ టెక్నాలజీని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిందనీ, ఈ- మెషిన్ ట్రయల్ సైతం చెక్ చేశారనీ, విజయవంతమైతే త్వరలో ఆమోదం తెలపనున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఇదే టెక్నాలజీని శ్రీకాళహస్తీశ్వరాలయానికి కూడా అందించాలని ఎమ్మెల్యే కోరగా తప్పకుండా సాయపడతామని చందు హామీ ఇచ్చారు.

నాణ్యమైన వైద్యం, డిజిటల్ నర్వ్ సెంటర్ లక్ష్యం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో టాటా ఎండి గ్రూప్ కుప్పం నియోజకవర్గంలోని 11 పీహెక్సీ 2 అర్బన్ హెల్త్ సెంటర్లలో గల ప్రజలకు ఉచిత నాణ్యమైన వైద్యసేవల నిమిత్తమై మొదటగా డిజిటల్ నర్వ్ సెంటర్ కుప్పంలో ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి తెలిపారు. ఈ సెంటలర్‌లో జూలై 1 నుంచి ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు అత్యంత సులువుగా, అత్యంత వేగంగా, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించటమే ఈ సెంటర్ లక్ష్యమని తెలిపారు. దీని ద్వారా ప్రజలకు ఆధార్ కార్డు లాగా ఆబా ఐడి కార్డ్ ఇవ్వడం జరుగుతుందని, దీనితో వారి ఆరోగ్య స్థితిగతులను నమోదు చేసి టెలి మెడిసిన్ ద్వారా ప్రత్యేక వైద్యనిపుణుల చేత చికిత్సలు అందివ్వడం జరుగుతుందన్నారు. దీనివలన ప్రజలకు స్థానికంగానే నాణ్యమైన వైద్యం, టైం, ఆర్థిక వేసులుబాటు లభిస్తుందని అంతేకాకుండా వెనుకటికి అనారోగ్యం వచ్చినప్పుడు నమోదు చేసుకున్న ప్రజలకు సులభంగా వైద్యం చేయుటకు వీలవుతుందని తెలిపారు. ఈ డిజిటల్ సెంటర్ చిత్తూరు జిల్లా మొత్తం ప్రజానీకానికి వైద్యం అందించేందుకు త్వరలో ప్రత్యేక ప్రణాళిక తయారవుతుందని తెలిపారు.

మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ సుధారాణి

పాలి హౌస్ గ్రూప్స్ స్థల పరిశీలన

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ వి.యం.థామస్ నియోజకవర్గంలో పరిశ్రమ స్థాపించాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కృషి చేస్తున్న విషయం తెలిసిందే. మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే గంగాధరనెల్లూరు, ఎస్ఆర్ పురం మండలాల్లో పర్యటించి పరిశ్రమల కోసం స్థలం పరిశీలించారు. దీంతో గత రెండు రోజులుగా అధికారులు రికార్డుల పరంగా స్థలాన్ని గుర్తించడం పూర్తి చేశారు. బుధవారం చెన్నై నుండి పాలి హౌస్ గ్రూప్స్ సంస్థ, పాల్కాట్ లాజిస్టిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఇళంగో నారాయణన్ గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని గంగాధర నెల్లూరు మండలం చిన్న వేపంజేరి, బాలగంగనపల్లి, ఎస్ఆర్ పురం మండలంలోని పాతపాళ్యం, దాసరిగుంటలో పర్యటించి ఇండస్ట్రీ స్థాపన కొరకు దాదాపు 1000 ఎకరాలు ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఎస్ఆర్ పురం తహశీల్దార్ లోకనాథ్ పిళ్ళై, గంగాధర నెల్లూరు తహశీల్దార్ తులసీరామ్ ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డును పరిశ్రమల అధినేతకు చూపించారు. స్థానిక ఎమ్మెల్యే థామస్ ఆదేశాల మేరకు ఫ్యాక్టరీలను పరిశ్రమల ఏర్పాటు చేస్తున్నట్లు ఇళంగో తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సునీత, ఎమ్మెల్యే పీఏ చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రతినిధికి రికార్డులు చూపిస్తున్న తహశీల్దార్లు

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు



ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండల తహశీల్దార్‌గా హనుమంతు నాయక్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో చౌడేపల్లి తహశీల్దార్‌గా పనిచేసి బదిలీపై పెద్దపంజాణికి వచ్చినట్లు ఆయన తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవంతో మండలంలో రెవెన్యూ సమస్యలను గ్రామ రెవెన్యూ అధికారులతో కలిసి సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. పాఠశాలలకు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు వెంటనే అందించాలని, సమయం ఉందని నిర్లక్ష్యం వహించవద్దని గ్రామ రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కొరకు సహకరించాలని సమస్య ఉంటే నేరుగా తెలియజేయవచ్చని కోరారు. గతంలో ఇక్కడ పనిచేసిన అనిల్ కుమార్‌రెడ్డి డిప్యూటీ తహశీల్దారుగా పలమనేరుకు బదిలీ అయ్యారు. నూతన తహశీల్దార్ హనుమంతు నాయక్‌ను అలాగే బదిలీ అయిన అనిల్ కుమార్‌రెడ్డిని గ్రామ రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది దుశ్యాలతో పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించారు. డిప్యూటీ తహశీల్దార్ యుగేష్ రెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాకేష్ కుమార్, గ్రామరెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం ఆచారి, వీఆర్వోలు క్రిష్ణంరాజు, ఉమా శంకర్, రాజన్న, సుజాత పాల్గొన్నారు.

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

మామిడి రైతులకు భోజనం పంపిణీ చేస్తున్న రామచంద్ర యాదవ్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: జిల్లాలోని మామిడి రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం గంగాధర నెల్లూరు మండల కేంద్రంలో జైన్ మామిడి గుజ్జు పరిశ్రమ వద్ద ఆయన చేరుకుని మామిడి రైతులకు సంఘీభావంగా నిరసన తెలియజేశారు. గత 15 రోజులుగా మామిడి రైతుల కష్టాలు వర్ణనాతీతమణి, ట్రాక్టర్లతో కిలోమీటర్ల మేర వేసి చూస్తున్న రైతులకు ఫ్యాక్టరీ యాజమాన్యాలు ప్రభుత్వం మొండి చేయి చూపుతోందని అన్నారు. వెంటనే మామిడి రైతులను ఆదుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా రైతు ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం మామిడి రైతు ట్రాక్టర్ల డ్రైవర్లకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

క్రైం న్యూస్

గ్యాస్ సిలిండర్ పేలి షెడ్డు ధ్వంసం

రూ.40లక్షలు ఆస్తి నష్టం

ప్రజాశక్తి- రామకుప్పం: మండల పరిధిలోని బగళనత్తం గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలి షెడ్డు ధ్వంసమైన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని లక్ష్మమ్మకు చెందిన షెడ్డును రామకుప్పంకు చెందిన అక్బర్‌కు ఒకటిన్నర సంవత్సర క్రితం బాడుగకుగాను ఇచ్చారు. అతను షెడ్డులో సోఫాలు తయారు చేసి విక్రాయించుకునేవాడు. కాగా మంగళవారం రాత్రి షెడ్డులోని గ్యాస్ సిలెండర్ పేలడంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కుప్పం అగ్నిమాపక సిబ్బంది త్వరితగితన వచ్చి మంటలు అదుపు చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. అయితే అప్పటికే షెడ్డులోఉన్న సోఫాలు, పరుపులు, గృహాలకు కావలసిన ముడిసరుకులు తదితర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో సుమారు రూ.30 లక్షల వరకు నష్టం వచ్చిందని, షెడ్డుకు రూ.10లక్షల వరకు ఆస్తి నష్టం వాటిలిందని తెలిపారు.

రాతి బండ పడి యువకుడు మృతి

మృతుడి (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం పట్టణం వడ్డేపల్లి ప్రాంతంలో చోటు చేసుకున్న ప్రమాదంలో యువకుడు ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటన బుధవారం స్థానికంగా కలవరం లేపింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. వడ్డేపల్లి ప్రాంతంలోని రాళ్ల గంగమ్మ దేవాలయం ఎదురుగా గుట్టకు సంబంధించి రాతి పనులు జరుగుతున్నట్టు స్థానికులు తెలిపారు. ప్రమాదవశాత్తు రాతిబండ యువకుడిపై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు వైద్య చికిత్సల నిమిత్తం క్షతగాత్రున్ని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యసేవల నిమిత్తం క్షతగాత్రుని తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి నగరంలోని ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించినట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

వేరుశనగ విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ రైతుసేవా కేంద్రం వద్ద మండల వ్యవసాయ అధికారి పయాజ్ బాష రైతులకు వేరుశెనగ విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సౌకర్యం ప్రభుత్వం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకొని, మెరుగైన పంటలు పండించి, లాభాలను అర్జించాలని సూచించారు. వ్యవసాయ పద్ధతులలో మెరుగైన పద్ధతులను అవలంభిస్తే దిగుబడి సాధించవచ్చని తెలిపారు. అనంతరం వేరుశనగ పంటను సందర్శించి, రైతులకు అవసరమైన సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెరుమాల్, అగ్రికల్చర్ అసిస్టెంట్ జయసుధ, టిడిపి నాయకులు మణి, కనకరాజు, బీరప్ప, నాగరాజు, రమేష్, బాలు, వెంకటాచలం పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

'పాడె' మోత.. పడతా లేస్తా..!

● పంట పొలాల్లో వెళ్లాల్సిందే.. ● కల్లిపూడిలో శ్మశానానికి దారేది..?

ప్రజాశక్తి - తొట్టంబేడు

పంట పొలాల మీదుగా అంతిమయాత్ర సాగిస్తూ...

మనిషి పుట్టుక నుండి మరణించే వరకూ జీవన పోరాటం చేస్తూనే ఉన్నాడు. ఆ ఊళ్లో మనిషి పోతే కుటుంబీకులకు, బంధుమిత్రులకు నరకమే. భౌతికకాయాన్ని స్మశానానికి తీసుకుని పోయే లోపు వారి బంధుమిత్రులకు చచ్చేంత పని అవుతుంది. వివరాల్లోకి వెళితే... మండలంలోని తాటిపర్తి పంచాయతీ కల్లిపూడి దళితవాడలో మంగళవారం రాత్రి కొప్పుల వెంకటమ్మ (80) మతి చెందారు. ఈ గ్రామంలో ఎవరైనా చనిపోతే స్మశాన వాటికకు వెళ్లాలంటే పంట పొలాల మధ్య నడుచుకుంటూ వెళ్లాలి. ఇక్కడ దాకా పరిస్థితి ఒకరకంగా ఉంటుంది. పంట పొలాలను దాటిన తర్వాతే అసలు సమస్య మొదలవుతుంది. స్మశాన వాటికకు పోయే మార్గంలో తెలుగు గంగ కాలువ మీద నిర్మించిన సన్నపాటి బ్రిడ్జి మీదుగా భౌతిక కాయాన్ని తీసుకొని పోవాలి. ఈ బ్రిడ్జి నిర్మించి చాలా సంవత్సరాలు గడుస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. స్మశానంలో కూడా మౌలిక వసతులు కూడా సరిగా లేవని గ్రామస్తుల నుంచి వినిపిస్తున్న మాట. శవయాత్రలో పాల్గొన్న బంధుమిత్రులు సేద తీరటానికి ఒక చిన్నపాటి గది నిర్మించాలని, అలాగే స్మశాన వాటిక ఆవరణలో విష సర్పాలు చేరకుండా ఆ ప్రాంతంలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి స్మశాన వాటిక చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

దారి సమస్య వాస్తవమే : సురేంద్రనాథ్, ఎంపిడిఓ

ఈ విషయమై ఎంపీడీవో సురేంద్రనాథ్‌ను వివరణ కోరగా కల్లిపూడి గ్రామంలో స్మశానానికి పోయే మార్గంలో సమస్య ఉన్న విషయం వాస్తవమే. ఈ దారి విషయం రెవిన్యూ శాఖకు సంబంధించింది. తెలుగు గంగ కాలువ మీద ఉన్న బ్రిడ్జిని నూతనంగా నిర్మించడానికి శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గత మాసం మే నెలలో భూమి పూజ చేశారు. అలాగే స్మశాన వాటికలో మౌలిక వసతుల కొరకు ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ నిధుల ద్వారా తొందరలోనే చేపడతాం.

కాలు పోయినా..కనికరం లేదు..

● పింఛన్ ...ఏడీ 'పింఛెన్' ● ఏడాదిగా లబ్ధిదారుల నిరీక్షణ

ప్రజాశక్తి - కెవిబిపురం

పక్క చిత్రంలోని వ్యక్తి పేరు బాలాజీ (20). కెవిబిపురం మండలం ఎస్ఎల్ పురం గిరిజన కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో ఓ కాలు పూర్తిగా పోయింది. కాలు లేని విషయం కళ్లెదుటే కనిపిస్తోంది.. అయినా అధికార యంత్రాంగంలోనూ, కూటమి ప్రభుత్వంలోనూ కనికరం లేదు.. నిరుపేద కుటుంబం.. ఏ పని చేయలేడు. ఏడాదిగా ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌కోసం నిరీక్షిస్తున్నాడు. పింఛన్ రూపంలో ప్రభుత్వ సాయం అందితే కనీసం తన ఖర్చులకైనా ఇంటి వాళ్లపై ఆధారపడే పరిస్థితి ఉండదని, చేతికి అంది వచ్చిన కొడుకును ఇంటిని చూసుకోవాల్సి ఉందని, అయితే తానే కుటుంబంపై ఆధారపడే పరిస్థితి నెలకొందని 'ప్రజాశక్తి'తో వాపోయాడు.

ఆమె పేరు తుపాకుల ధనమ్మ.. కెవిబిపురం మండలం దిగువ పుత్తూరు గిరిజన కాలనీ వాసి. 2023, ఏప్రిల్ నెలలో భర్తను కోల్పోయింది. అప్పటినుంచి వితంతు పింఛన్ కోసం ఎదురుచూస్తూనే ఉంది. 2024, జనవరి వరకూ వైసిపి నాయకులు అదిగో ఇదిగో అంటూ నెట్టుకొచ్చారు. తరువాత ఎన్నికల కోడ్ అని జూన్‌లో ఎగ్గొట్టారు. తరువాత కూటమి ప్రభుత్వం వచ్చింది. ప్రభుత్వం మారినా పింఛన్ దరఖాస్తులను ఇంతవరకూ స్వీకరించలేదు. దీంతో ఇల్లు గడవడమే కష్టంగా ఉందని కంట తడిపెట్టుకుంది. అదే కాలనీలో మంగమ్మ (60) కూడా వృద్ధాప్య పింఛన్ కోసం ఎదురుచూస్తోంది. వయస్సు పైబడి ఉపాధి పనులకు, వ్యవసాయ కూలి పనులకు వెళ్లలేకపోతున్నానని, దరఖాస్తుకు అవసరమైన ధృవీకరణ పత్రాలను జతపరచి ఎదురుచూస్తున్నా ప్రభుత్వం స్వీకరించడం లేదని వాపోయింది.

కాలు లేదని స్పష్టంగా కళ్లముందు కనిపిస్తున్నా..

ఈ ఆవేదన అంతా ధనమ్మ, లక్ష్మమ్మ, బాలాజీ సమస్య మాత్రమే కాదు. మండలంలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, విభిన్న ప్రతిభావంతులు, డప్పుకళాకారులు, చేనేత కల్లుగీత కార్మికుల ఆవేదన. మండలంలో 15 కేటగిరీల్లో 6,964 మందికి సామాజిక పింఛన్ అందుతోంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా పింఛన్లను మంజూరు చేయకపోవడంతో అర్హులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆరు నెలలకు ఒకసారి జనవరి, జూన్ నెలల్లో కొత్త పింఛన్లను మంజూరు చేసేవారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త పింఛన్ల మంజూరుకు నోచుకోలేదు. పింఛన్ల దరఖాస్తుకు వెబ్‌సైట్ తెరచుకోవడం లేదని వాపోతున్నారు. కనీసం ఎప్పుడిస్తారనేది కూటమి నేతలు చెప్పకపోవడంతో అర్హులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబానికి భారంగా ఎలా పడి ఉండాలని? మండిపడుతున్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి- విజయపురం (నగరి):

తాము చదువుకున్న పాఠశాలకు ప్రోత్సాహం అందించాలని భావించిన పూర్వ విద్యార్థి లోకేష్ అతని సహచరులు ముందుకువచ్చారు. బుధవారం గుండ్రాజుకుప్పం గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు విచ్చేసినవారు ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు చదువుచున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, జామెంటరీ బాక్స్‌లను ఎంఈవో శ్రీదేవి ద్వారా అందించారు. 2024-25 విద్యాసంవత్సరంలో పదవతరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన ప్రియదర్శిని, ప్రీతంసాయి, షాలినికి రూ.2000, రూ.1500, రూ.1000 చొప్పున నగదు పురస్కారాలు అందించారు. అనంతరం దాతలను ఎంఈవో అభినందించారు. దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని నీరజారాణి, ఉపాధ్యాయులు జయానంద్, చంద్రయ్య, జయపాల్, నారాయణ నాగభూషణం, మోక్షదాయిని, తిరుమలరాజు, సుహాసిని, నాగమణి పాల్గొన్నారు